క్లుప్తంగా

అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ



విజేతలకు బహుమతులు అందిస్తున్న హెచ్ఎం

రావికమతం: మేడివాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం లూయిస్ బ్రెయిలీ 214వ జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అంధులకు అక్షర జ్ఞానాన్ని ప్రసాదించిన మహోన్నతుడు బ్రెయిలీ అని ప్రధానోపాధ్యాయిని జయలక్ష్మి కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథనాయుడు, అప్పలనాయుడు, కాశీ విశ్వనాథం పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



విద్యార్థులకు ఆరోగ్య సూచనలు చేస్తున్న హెచ్‌పీ త్రినాథ్

కె.కోటపాడు: వసతిగృహ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెచ్‌ప పి.త్రినాథ్ సూచించారు. ఎ.కోడూరు సమీకృత వసతి గృహంలో విద్యార్థులకు గురువారం ఆయన ఆరోగ్య పరీక్షలు చేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యం అందించి మందులు ఇచ్చారు. మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంతోపాటు జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందన్నారు. సీహెచ్‌వో శాంతి, వసతి గృహాధికారి పి.గంగునాయుడు పాల్గొన్నారు.

పక్షి సంపదను కాపాడాలి

మాకవరపాలెం: పక్షి సంపదను కాపాడుకునేందుకు అందరూ కృషి చేయాలని హెచ్ఎం గంగరాజు కోరారు. జాతీయ పక్షుల దినోత్సవాన్ని గురువారం జంగాలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించారు. పక్షి సంపద వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

నాతవరం: మండల కేంద్రంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు తెలిపారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఎర్రయ్య కుటుంబానికి డిప్యూటీ సీఎం పరామర్శ



ఎర్రయ్య భార్య కొండమ్మను ఓదార్చుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: స్థానిక సర్పంచ్ ఎడ్ల కళావతి తండ్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పి.ఎర్రయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు అతడి కుటుంబాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, ఏ కష్టమొచ్చినా తనకు సమాచారం అందించాలని ఎర్రయ్య భార్య కొండమ్మకు భరోసా కల్పించారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, ఎంపీటీసీ పాలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి- 2గా రవితేజ

మాడుగుల రూరల్: కె.జె.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి- 2గా బొడ్డేడ రవితేజ నియమితులయ్యారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో గురువారం ఆయన మాట్లాడుతూ రోగులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తామన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని గ్రామాల్లో పక్కాగా నిర్వహిస్తామన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీతో గ్రామాల్లో సందడి

చోడవరం: కొత్త పింఛన్ల పంపిణీతో గ్రామాలన్నీ సందడిగా ఉన్నాయి. నియోజకవర్గంలో 1,368 మందికి వివిధ విభాగాల్లో ఈ నెల నుంచి కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. దీనితో అన్ని గ్రామాల్లో ఈ నెల 3వ తేదీ నుంచి పంపిణీ ప్రారంభించారు. ఈ నెల 7వ తేదీ వరకు పంపిణీ చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు పింఛన్‌దారులకు పంపిణీ చేస్తున్నారు. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లో 48 గ్రామాల్లో గురువారం 310 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ఒకొక్కరికి రూ. 2,750 చొప్పున అందిస్తున్నారు. గాంధీ గ్రామంలో చోడవరం ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ గాడి అప్పారావు పంపిణీ చేశారు. వార్డు మెంబరు దాడి జగదీష్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేచలపు ప్రకాష్ పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు
ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మున్సిపాలిటీలోని పెదబొడ్డేపల్లి గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి



గాంధీ గ్రామంలో కొత్త పింఛన్ నగదు అందజేస్తున్న ఎంపీపీ గాడి కాసు

ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులనుద్దేశించి మాట్లాడుతూ టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకున్న వారికి మాత్రమే పింఛన్లు వచ్చేవన్నారు. సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పార్టీలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీలో కొత్తగా 200 మందికి పింఛన్లు మంజూరు చేశామన్నారు. నాలుగు దఫాలుగా డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని సీఎం ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే రెండు ధపాలు రుణాలు మాఫీ చేశారన్నారు. ఈ నెలలో మూడో దఫా రుణాలు మాఫీ చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి సీఎం శంకుస్థాపన



లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్, చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి

చేశారన్నారు. రూ.20 కోట్లతో పట్టణంలో మెయిన్ రోడ్డు విస్తర్ణతోపాటు ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణం చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు తమరాన అప్పలనాయుడు, గొలుసు నర్సింహమూర్తి, పార్టీ పట్టణాధ్యక్షుడు ఏకా శివ, కమిషనర్ కనకారావు, కౌన్సిలర్లు బోడపాటి సుబ్బలక్ష్మి, మాకిరెడ్డి బుల్లిదొర, బేతిరెడ్డి రత్నం, వీరమాచినేని జగదీశ్వరి, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, లగుడు స్వామి, నాయకులు పాల్గొన్నారు.

పాడి రైతుల ఆపద్బాంధవుడు ఆడారి



తులసీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

చోడవరం రూరల్: పాడి రైతులకు ఆపద్బాంధవుడిగా ఆడారి తులసీరావు రైతుల గుండెల్లో నిలిచి ఉంటారని లక్ష్మీపురం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి శానాపతి సత్యారావు తెలిపారు. ఖండిపల్లి రైతు భరోసా కేంద్రంలో గురువారం ఆడారి చిత్రపటానికి పూలమాలలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఉత్తరాంధ్ర జిల్లాలను కరువు కాటకాల నుంచి పాడి పరిశ్రమ ద్వారా ఆదుకున్నారని కొనియాడారు. పీఏసీఎస్, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తకోట జూనియర్ కళాశాల అభివృద్ధికి



కొత్తకోట జూనియర్ కళాశాలలో తులసీరావు మృతికి సంతాపం తెలుపుతున్న విద్యార్థులు

తులసీరావు కృషి

రావికమతం: కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విశాఖ డైయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సాయికుమార్ మాట్లాడుతూ కళాశాలకు అదనపు భవనాలను సీఎస్ఆర్ నిధులతో నిర్మించి వసతి సమస్య లేకుండా చేశారని తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



గోవాడలో తులసీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

తులసీరావుకు ఘన నివాళి

చోడవరం: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మృతి తీరని లోటని వక్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోవాడ పాల కేంద్రం వద్ద తులసీరావు సంతాప కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, విశాఖ డెయిరీ డైరెక్టర్ దాడి పవన్, సర్పంచ్ మళ్ల శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగదుర్గ గోవింద, బేరా సత్యారావు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి సీఎం కృషి

సింహాద్రిపురంలో 'గడప గడపకు' కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



సింహాద్రిపురంలో మహిళలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. సంహాద్రిపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుతీరుపై ఆరా తీశారు. సచివాలయం, గ్రామ వలంటీర్ల పనితీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హతే కొలమానంగా పార్టీలకతీతంగా ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. ఇందులో ఎవరు సిఫారసు లేకుండానే వలంటీర్ల ద్వారా ఇస్తున్నామన్నారు. రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి గ్రామస్థాయికే వ్యవసాయ సేవలు తెచ్చి రైతుల కష్టాలు తీర్చారని ప్రశంసించారు. గ్రామంలో పలు అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ దంతులూరి శ్రీనివాసరాజు కోరారు. దీనికి ఆయన స్పందించి పరిష్కరిస్తామన్నారు. చోడవరం ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, వైస్ ఎంపీపీలు బుద్ద గంగరాజు, బైన ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొడ్డేడ సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్శి తోటలకే తొలి ప్రాధాన్యం

రోలుగుంట ఏరియా సుగర్ కేన్ ఇన్‌స్పెక్టర్ కొండబాబు



కాటాకు చెరకు తీసుకొచ్చిన రైతులు

రోలుగుంట: గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి తరలించేందుకు చెరకు కార్శి తొటలకే తొలి ప్రాధాన్యమిస్తున్నామని రోలుగుంట ఏరియా సుగర్ కేన్ ఇన్‌స్పెక్టర్ కొండబాబు తెలిపారు. గత నెలలో సభ్య రైతుల నుంచి చెరకు సేకరించే భాగంగా గోవాడలో గానుగాట ప్రారంభించారు. కాటాలకు వచ్చిన చెరకును ఎప్పటికప్పుడు గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి తరలించేందుకు లారీలను ఏర్పాటు చేశారు. రోలుగుంట, జె.నాయడుపాలెం చెరకు కాటాలను గురువారం ఆయన సందర్శించారు. రైతులకు ఇస్తున్న చెరకు పర్మిట్ల విధానాన్ని, లారీలతో చెరకు రవాణా సౌలభ్యాన్ని పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులందరి నుంచి చెరకు తీసుకుంటామని, రస నాణ్యత ఆధారంగా చెరకు సేకరించే భాగంగా కార్శి తోటలకు ప్రాధాన్యమిస్తున్నామని, సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

దేవానంద స్వామీజీ ఆరాధన మహోత్సవం రేపు



సద్గురు దేవానంద సరస్వతీ స్వామీజీ విగ్రహం

దేవరాపల్లి: సద్గురు దేవానంద సరస్వతీ స్వామీజీ మహరాజ్ (రుషీకేష్) 23వ ఆరాధన మహోత్సవాలను కొత్తపెంటలోని స్వామీజీ ఆశ్రమంలో శనివారం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ రొంగలి నీలిమ గురువారం తెలిపారు. ఈ మేరకు దేవానంద స్వామీ ఆధ్యాత్మిక జీవన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. దేశ వ్యాప్తంగా స్వామీజీ భక్తులు, శిష్యులు, సాధు సత్పురుషులు హాజరవుతారన్నారు. అభిషేకాలు, భగవద్గీత పారాయణం, మహాత్ముల ప్రవచనాలు, అన్నసమారాధన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఆశాజనకంగా టమాటా సాగు



దాలివలసలో టమాటా పంట

కె.కోటపాడు: మండలంలో టమాటా సాగు ఆశాజనకంగా ఉంది. రెణ్నెల్లలోనే చేతికంది వచ్చే పంట కావడంతో రైతులు విస్తారంగా సాగు చేశారు. కె.కె.అగ్రహారం, ఆర్లి, చంద్రయ్యపేట, కె.సంతపాలెం, ఆర్లి, సూదివలస, దాలివలస, మర్రివలస, పాతవలస గ్రామాల్లో 200 ఎకరాల్లో పండిస్తున్నారు. ప్రధానంగా తక్కువ పెట్టుబడితోపాటు సాగుకు అనుకూలంగా ఉండడంతో మంచి దిగుబడి సాధించగలమని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు.

చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య

కె.కోటపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతోపాటు అదనపు ఆహారాన్ని ఇవ్వనున్నట్లు స్థానిక ఐసీడీఎస్ పీవో మంగతాయారు తెలిపారు. మల్లంపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న వైఎస్సార్ పోషణ కిట్లను అడిగి తెలుసుకున్నారు. 0-5లోపు చిన్నారులను తప్పనిసరిగా తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. కేంద్రాల నిర్వాహకులు చిన్నారుల వయసుకు తగ్గ బరువు, ఎత్తు గుర్తించాలని సూచించారు. అంగన్‌వాడీ



మాట్లాడుతున్న పీవో మంగతాయారు

కార్యకర్త వెంకటలక్ష్మి, వార్డు మెంబర్లు వంటాకు గోవిందరావు, వంటాకు రామునాయుడు పాల్గొన్నారు.

రూ.30 లక్షలతో మండల పరిషత్ బడ్జెట్

నర్సీపట్నం: ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. వచ్చే 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక అంచనా బడ్జెట్ రూపొందించారు. మండలంలో సెగ్మెంట్లు వారిగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు, సిబ్బంది జీత భత్యాలతో సుమారు రూ.30 లక్షలతో అంచనా బడ్జెట్ నివేదిక తయారు



బడ్జెట్‌పై చర్చిస్తున్న ఎంపీపీ రాజేశ్వరి

చేశారు. మండల పరిషత్‌కు వివిధ మార్గాల్లో వచ్చే ఆదాయం వనరులు గురించి ఎంపీటీసీ సభ్యులకు వివరించారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులు చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఎంపీపీ, ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు కూండ్రపు తాతబాబు, ఇన్నం రత్నం పాల్గొన్నారు.

తిరువీధుల్లో మెరిసిన దేవ దేవుడు

నక్కపల్లి : ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస అధ్యయనోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో దేవదేవుడు అమ్మవారితో కలసి తిరువీధుల్లో ఊరేగుతున్నారు. ఉదయం, రాత్రికూడా స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం కొండపై కల్కి అవతారంలో వెలసిన స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం,నిత్యార్చనలు నిర్వహించారు. కొండ దిగువ ఉత్సవమూర్తులకు నిత్యపూజలు అనంతరం ధనుర్మాస పూజల్లో భాగంగా బాలబోగ నివేదన, రాజబోగనివేదన నిర్వహించారు. అనంతరం ఉభయ నాంచారులతో కూడిన దేవదేవుడిని ఇత్తడి సప్పరం వాహనంలోను, గోదాదేవి అమ్మవారిని పల్లకీలోనూ ఊరేగించారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై 21వ పాశురాన్ని విన్నపం చేశారు. రాత్రి అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహించారు. ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, గోపాలాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయండి

చోడవరం లేఅవుట్‌ను పరిశీలించిన డీఈఈ శ్రీనివాస్



చోడవరం లేఅవుట్‌ను పరిశీలిస్తున్న చోడవరం డీఈఈ శ్రీనివాస్

చోడవరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ చోడవరం డీఈఈ శ్రీనివాస్ తెలిపారు. పట్టణ శివారు పంప్ హౌస్ దగ్గర జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ సముదాయాన్ని గురువారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. లేఅవుట్‌కు వెళ్లే రహదారి పక్కాగా లేకపోవడం వల్ల ఇంటి నిర్మాణ సామగ్రి తెచ్చుకోవడానికి ఇబ్బందిగా ఉందని వాపోయారు. రోడ్డుతోపాటు నీటి సౌకర్యం కల్పించాలని వారు కోరారు. రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని, నిర్మాణాలు మాత్రం వేగంగా చేసుకోవాలని సూచించారు. వర్క్ ఇనస్పెక్టర్ నాయుడు పాల్గొన్నారు.

ఉగాది కల్లా జగనన్న కాలనీల్లో ఇళ్ల పూర్తి

దేవరాపల్లి: ఉగాది కల్లా జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలు చేసేలా నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలని మాడుగుల నియోజకవర్గ హౌసింగ్



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈఈ రాజు

డీఈఈ ఏ.వి.వి.ఎస్.ఎన్.రాజు ఆదేశించారు. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి అధ్యక్షతన గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై గ్రామాల వారీగా ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గంలో 115 లేఅవుట్లలో 8,599 మందికి కాలనీ ఇళ్లు, ప్రధాన మంత్రి అవాస్ యోజన(గ్రామీణ) కింద మరో 1,175 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. వీటిలో 149 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, 1,786 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. దేవరాపల్లి మండలంలో 33 లేఅవుట్లలో 720 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. దేవరాపల్లిలోని 13 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ సిద్ధం చేస్తున్నామన్నారు. ఇక్కడి దేవరాపల్లి, బోయిలకింతాడ, కలిగొట్ల, కాశీపురం గ్రామాలకు చెందిన 314 మందికి ఇళ్లు మంజూరు చేశామని, సంక్రాంతి తర్వాత నిర్మాణాలను చేపడతామన్నారు. హౌసింగ్ ఏఈ బి.రాము, ఈవోపీఆర్డీ కె. ఉషశ్రీ, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ భవ్యతేజ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



చీడికాడ: బోరు తవ్వకానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ కురచా జయమ్మ



చింతలపూడిలో బోరు తవ్వకం పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ

చీడికాడ: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ కురచా జయమ్మా తెలిపారు. మండల పరిషత్ నిధులు నుంచి స్థానిక బొబ్బిలి వారి కళ్లాల వద్ద తాగునీటి బోరు తవ్వకానికి గురువారం ఆమె భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామాల్లో 19 తాగునీటి బోర్ల ఏర్పాటుకు రూ.19.80 లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు లాలం శారదావరలక్ష్మిజానకీ రామ్, నాయకులు ఎర్రా అప్పారావు, బొడ్డు అప్పలనాయుడు, పరువాడ మహేశ్, పాల సొసైటీ అధ్యక్షుడు పరువాడ అప్పారావు, సిమెంటు నాయుడు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ప్రతీ ఇంటికి కుళాయి నీరు

దేవరాపల్లి: గిరిజన గ్రామాల్లో సైతం ప్రతీ ఇంటికి కుళాయి నీరు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చింతలపూడి సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ అన్నారు. గ్రామంలో మంచినీటి బోరు తవ్వకం పనులకు ఎంపీటీసీ బండి గౌరమ్మతో కలిసి గురువారం ఆమె భూమిపూజ చేసి ప్రారంభించారు. జలజీవన్ మిషన్ నుంచి రూ.2.16 కోట్లతో పంచాయతీ పరిధిలోని చింతలపూడితోపాటు సమ్మెద, కొత్తూరు, కోరాడ, బల్లిపురం తదితర గిరిజన గ్రామాలకు ప్రతీ ఇంటికి మంచినీటి సదుపాయం కల్పిస్తామన్నారు. దొమ్మంగి శ్రీనువాసరావు, దొమ్మంగి సన్యాసమ్మ, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రగతి ఎప్పటికప్పుడు నమోదు

అనకాపల్లి జిల్లా ఉప విద్యాధికారి ప్రేమ్‌కుమార్

చోడవరం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ విద్యార్థి ప్రగతిని ఎప్పటికప్పుడు నమోదు చేసి, వారిని ముందు వరసలోకి తీసుకు రావడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని అనకాపల్లి జిలా ఉప విద్యాధికారి ప్రేమ్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్, టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ కార్యక్రమాల పట్ల ఆయా ఉపాధ్యాయులకు, సీఆర్పీలకు ఒకరోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. వీటిని డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్ పరిశీలించి మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల



శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్లు

ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యా బోధనలో వినూత్న పద్ధతులను అమలుపరచి విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తిని పెంచేలా చేయాలని సూచించారు. ఈ శిక్షణకు డైట్ లెక్చరర్ నాగేశ్వరరావు, బైలపూడి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వి.గిరి రిసోర్స్ పర్సన్లు వ్యవహరించారు. కార్యక్రమాన్ని ఎంఈవో శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

దేవరాపల్లి అభివృద్ధికి సహకరించాలి

దేవరాపల్లి: స్థానిక గ్రామాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రజలంతా సహకరించాలని దేవరాపల్లి సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ కోరారు. మార్చి నెలాఖరులోగా ఇంటి పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. స్థానిక గ్రామ సచివాలయం-2లో గురువారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ముందుగా పంచాయతీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఆదాయం, ఖర్చు వివరాలను తెలియజేశారు. పంచాయతీలో రూ.33 లక్షల మేర ఇంటి పన్నులు బకాయి ఉందన్నారు. ప్రజలు వీటిని చెల్లించాలని కోరారు. పారిశుధ్యం మెరుగుపర్చేందుకు ప్రజలంతా సహకరించాలని,



మాట్లాడుతున్న సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, సెక్రటరీ శ్రీనివాసరావు

తడి, పొడి చెత్త వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాకవరపాలెం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నర్సీపట్నం డీఈ సురేష్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఆనుకుని స్తంభాలు మార్పు చేయడంతోపాటు లైన్ మరమ్మతులు చేపట్టనుండటంతో అవంతి కళాశాల, రాచపల్లి, కోడూరు, తామరం, మాకవరపాలెం, తూటిపాల, పైడిపాల, కొండల అగ్రహారం, గిదుతూరు, దాలింపేటలో సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

దేవరాపల్లి సబ్ స్టేషన్ పరిధిలో...

దేవరాపల్లి: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కె. శంకరరావు తెలిపారు. సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. దేవరాపల్లి, పినకోట, తారువ, పెద నందిపల్లి ఫీడర్ల పరిధి ప్రజలంతా సహకరించాలని సూచించారు.